క్లుప్తంగా

మాజీ మంత్రిని కలిసిన పార్టీ నాయకులు


పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు

గంగవరం: మండల వైఎస్సార్‌సీపీ నేతలు పలువురు పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో పార్టీ విషయాల గురించి చర్చించారు. నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామన్నారు. వచ్చే నెలలో మండలంలో జరిగే ఓ శుభకార్యానికి రావాలని పెద్దిరెడ్డిని ఆహ్వానించారు. పుంగనూరు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

సల్లాపురెమ్మకు పూజలు


విశేష అలంకరణలో శ్రీ సల్లాపురెమ్మ

బైరెడ్డిపల్లె: స్థానిక ఎస్సీ కాలనీలోని శ్రీ సల్లాపురెమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న జాతరలో భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి, విశేష పూజలు, హోమం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని మొక్కారు. చుట్టుప్రక్కల ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా పలు దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా చిన్నపిల్లల వివిధ ఆటవస్తువులు, ఇతరత్రా వాటి కొనుగోళ్లతో సందడిగా మారింది.

మండలానికి చేరిన వేరుశనగ విత్తనాలు


మతుకువారిపల్లె రైతు సేవా కేంద్రానికి వచ్చిన వేరుశనగ విత్తనకాయలు


పులిచెర్ల(కల్లూరు): ఈఏడాది ఖరీఫ్‌లో వర్షాధార పంటగా మెట్ట భూముల్లో సాగు చేయడానికిగాను పులిచెర్ల మండలానికి వేరుశనగ విత్తనకాయలు వచ్చాయని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు ఈఏడాది 1100 క్వింటాళ్ల విత్తన కాయలకు ప్రతిపాదనలు పంపితే 718 క్వింటాళ్లు పంపారని, గత ఐదు సంవత్సరాల పంపిణీని పరిశీలించిన అధికారులు సరాసరిగా అంచనా వేసి ఇచ్చారని చెప్పారు. ప్రతి ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోందని ఇది కూడా ఒక కారణం కావచ్చని పేర్కొన్నారు. ధర నిర్ణయించిన అనంతరం రైతులకు ఈవిత్తన కాయలను పంపిణీ చేస్తామన్నారు.

విశాఖ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


పుంగనూరులో ప్లకార్డులు పట్టుకుని మాట్లాడుతున్న నేతలు

పుంగనూరు: విశాఖ ఉక్కు కర్మాగారంలో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సోమవారం ఏఐటీయూసీ కార్యదర్శి వెంకట్రమణారెడ్డి, సీపీఐ నాయకుడు రామమూర్తి, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి మున్నా స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ప్లకార్డులు పట్టుకుని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ, ఉక్కు ఫ్యాక్టరీలో 2500 మంది కార్మికులను తొలగించి, ఆ కుటుంబాలను వీధుల్లో పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్యం కోసమే యోగా


యోగాపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ బాలాజి

పెద్దపంజాణి: ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం కోసం యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజి తెలిపారు. సోమవారం చలమంగలం గ్రామ పంచాయతీలో యోగాంధ్ర రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది యోగాసనాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు గ్రామ స్థాయిలో వివిధ అంశాలపై పోటీలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండల, సచివాలయ స్థాయిలో యోగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

గిట్టుబాటేదీ..?

లక్షలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధరలు లేక నష్టాల పాలవుతున్నారు. అప్పుల్లో కూరుకుపోతున్నారు. నష్టపోయిన రైతాంగం ప్రభుత్వ సాయం కోసం చూస్తున్నా రూపాయి విదిల్చే పరిస్థితి అయితే ప్రస్తుతం కానరావడం లేదు.

- ధరల పతనం
- అప్పుల్లో కూరుకుపోతున్న రైతాంగం
- ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- విలవిలలాడుతున్న దోస, టమాట, మామిడి రైతులు


గిట్టుబాటు ధర లేక పొలంలో వదిలేసిన దోస పంట

రొంపిచెర్ల: మండలంలో 7450 ఎకరాలలో మామిడి, 800 ఎకరాల్లో దోస, 600 ఎకరాల్లో టమాట సాగు చేశారు. ఇందుకోసం లక్షలాది రూపాయలు వ్యయం చేశారు. అయితే ఈ మూడు పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం రైతాంగానికి శాపమైంది. గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. దోస పంట టన్ను రూ. 6 వేల నుంచి రూ.10 వేలు వరకు ధర పలుకుపోతోంది. టన్ను టమాట రూ.4 వేల నుంచి రూ.5 వేల నడుమ ఊగిసలాడుతోంది.. మామిడి టన్ను రూ.15 వేల నుంచి రూ.30 వేలు వరకు ఉంది. ఈ ధరలు కూడా బాగా నాణ్యత ఉన్న పంటకు మాత్రమే రెండవ రకం, మూడవ రకం పంటకు ఇంక చెప్పవలసిన అవసరం లేదు. దీనికి తోడు రుతుపవనాల రాకతో ముందుగానే వర్షాలు పలకరించాయి. ప్రస్తుతం వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ధరలు లేక కొంత, వర్షాలకు మరి కొంత నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.. గత ఆరేళ్ల కాలంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి గిట్టుబాటు ధరలు లేకపోవడం శరాఘాతమైంది. చేతికి వచ్చిన పంట కనీసం పంట కోతలు, కూలీల ఖర్చులకు కూడా రావడం లేదని రైతన్నలు వాపోతున్నారు. గత ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు రైతు భరోసా ద్వారా రైతులను ఆదుకుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా రైతు భరోసా ఊసే లేదు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తమను సైతం నిండా వంచించిందని రైతులు ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోస్తున్నారు. రైతులను ఆదుకోకపోతే చివరకు క్రాప్ హాలిడే ప్రకటించినా ఆశ్చర్య పడనవసరం లేదని పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి.


గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్న టమాట రైతులు


ధర లేక మామిడి చెట్లలో కోయని కాయలు

డీలర్లు సమయపాలన పాటించాలి


డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

పెద్దపంజాణి: మండలంలోని ప్రభుత్వ చౌక దుకాణాల డీలర్లు విధిగా సమయపాలన పాటించాలని తహసీల్దార్ సీఎస్ అనిల్ కుమార్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మండలంలోని డీలర్లతో తహసీల్దార్ సమీక్షించారు. ప్రతి నెల 1నుంచి 15వ తేదీ వరకు వరకూ రేషన్ షాపులు పనిచేయాలన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకూ లబ్దిదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. అలాగే చౌక దుకాణంలో డీలర్ పేరు, మొబైల్ నంబర్, స్టాకు, పంపిణీ వివరాల సమాచారంతో బోర్డులు ఏర్పాటు చేయాలని, వృద్ధులు, వికలాంగులకు వారి ఇంటి వద్దనే నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ యుగేష్ రెడ్డి, ఆర్ఐ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి రేషన్ షాపుల్లో సరుకులు పంపిణీ

–డీలర్లతో తహసీల్దార్ సమీక్ష


డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రకాశ్

సదుం: రేషన్ డీలర్లు వినియోగదారులకు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ జయప్రకాశ్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో తహసీల్దార్ డీలర్లతో సమీక్షించారు. జూన్ 1 నుంచి ప్రభుత్వం రేషన్ దుకాణాలలో సరుకులను పంపిణీ చేసేందుకు నిర్ణయించిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు నిర్దేశించిన సమయంలో సరుకులు పంపిణీ చేయాలన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే ఇవ్వాలన్నారు. షాపులకు వచ్చిన స్టాక్‌ను శుభ్రంగా నిల్వ చేయాలన్నారు. కోవిడ్ మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో దుకాణాల వద్ద గుంపులు గుమికూడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీటీ కుమార్ పాల్గొన్నారు.

గోసంరక్షణకు రూ.2 లక్షల విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు నెల్లూరుకు చెందిన దాత చలపతిరావు రూ.2లక్షలు విరాళంగా ఇచ్చారు. దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఈ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా రక్షణకు తీర్మానం చేయరూ!

గంగవరం: తెలుగు భాషా రక్షణ కోసం టీడీపీ మహానాడు కార్యక్రమంలో తీర్మానం చేయాలని తెలుగు సాహిత్య సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను తిరుపతిలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.


మహిళలకు హెచ్‌ఐవీపై అవగాహన


హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ బాబు

బంగారుపాళెం: మహిళలు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సిలర్ బాబు అన్నారు. మండలంలోని బొమ్మాయిపల్లెలో సోమవారం గ్రామ సమాఖ్య మహిళలకు హెచ్ఐవీ, ఎయిడ్స్, టీబీ, సుఖవ్యాధులపై అవగాహన కల్పించారు. సుఖవ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్లను సంప్రదించి వైద్యం చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ల్యాబ్‌టెక్నీషియన్ జయచంద్ర, సీసీ శిరీష, సంఘ మిత్ర లీలావతి, క్షేత్రస్థాయి సిబ్బంది లక్ష్మి, కల్పన, వాణి, నందిని పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవానికి వేళాయే!

- ఇంద్ర వరదుడి వార్షికోత్సవాలకు నేడు అంకురార్పణ
- నాటి ఇంద్రపురి నేటి యాదమరి
- సాక్షాత్తు ఇంద్రుడు ప్రతిష్టించిన దేవతామూర్తి


శ్రీవరదరాజులస్వామి ఆలయం

యాదమరి: సాక్షాత్తూ అష్ట దిక్పాలకులకు అధిపతి అయిన ఇంద్రుడు ప్రతిష్ఠించిన శ్రీ పెరుందేవి సమేత శ్రీ వరదరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నేడు అంకురార్పణతో మొదలు కానున్నాయి. మండల కేంద్రంలోని నడిబొడ్డున వరదరాజస్వామిగా వెలసి భక్తులు కోరిన కోర్కెలు తీర్చి అభయ ప్రదాతగా కొలువై ఉన్నారు. బ్రహ్మోత్సవం వేళ ఆలయం నూతన శోభను సంతరించుకుంది. ఇప్పటికే ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రముఖ హిందూ దేవాలయాల కన్నా గరుడ సేవ చాలా ప్రత్యేకం. ఆ సమయంలో చాలా అరుదైన కృష్ణ గరుడ పక్షులు ఇక్కడికి విచ్చేసి స్వామి వారిని దర్శించడం ఒక ప్రత్యేకం. ఈ గరుడ పక్షులను దర్శించిన భక్తులకు శ్రీ మహావిష్ణువు సంపూర్ణ అనుగ్రహం కలుగుతుందని పురాణ గాథ. భూ అంతర్భాగంలో ప్రవహిస్తున్న త్రివేణి సంగమం ఒడ్డుపై ఉన్న ఇక్కడి స్వామి వారిని దర్శిస్తే సకల పాపాలూ హరించి..ఇహలోకంలో ఎటువంటి కష్టాలకు చోటు లేక అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలతో తులతూగుతారని ఇక్కడి భక్తుల విశ్వాసం. అందుచేతనే ఏటా ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలకు దేశ నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని తమ కోర్కెలను నెరవేర్చుకుని వెళుతుంటారు.

స్థల పురాణం

పూర్వం కృత యుగంలో దేవతలకు రాజైన దేవేంద్రునిపై జంబాసురుడు అనే రాక్షసుడు యుద్ధం ప్రకటించాడు. మిక్కిలి భయభ్రాంతులకు గురైన ఇంద్రుడు జంబాసురుడిపై గెలుపు కోసం బ్రహ్మదేవుని సూచనల మేరకు మహావిష్ణువు గురించి వెయ్యేళ్ల పాటు ఘోరమైన తపస్సు చేస్తాడు. భూలోకంలో అంజనాద్రి, శోభనాద్రి వద్ద త్రివేణి సంగమం అయినటువంటి గాయత్రి, సావిత్రి, సరస్వతి అంతర్వాహినిగా ప్రవహిస్తున్న ఒడ్డుపై వటవృక్షం(రావిచెట్టు) కింద క్షేత్రపాలకునిగా ఉన్న ఏకాంబరేశ్వర స్వామి అయిన మహాశివుడు అనుగ్రహంతో శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమవుతాడు. దీంతో స్వామి కరుణా కటాక్షాలతో అసురుడు అయిన జంబాసురునిపై గెలుస్తాడు. అనంతరం భువికి తిరిగి వచ్చి కలియుగంలో భక్తుల సంరక్షణార్థం మహావిష్ణువు యొక్క విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. దీంతో నాటి నుంచి నేటి వరకు స్వామి వారు ఇక్కడి భక్తులను కటాక్షిస్తున్నారు. నాడు ఇంద్రుడు తిరగాడిన ఈ ప్రాంతం ఇంద్రపురిగా ప్రసిద్ధి గాంచి, కాలక్రమంలో నేడు యాదమరిగా స్థిరపడింది. దాదాపు 700 ఏళ్ల ఘనమైన చరిత్ర కలిగిన ఈ దేవాలయం విలువైన స్థిరాస్తులు కలిగి ఉండడం విశేషం.

బ్రహ్మోత్సవం ఇలా..

శ్రీమన్నారాయణుని సేనాపతి, విష్ణు గణాలకు అధిపతి అయిన విష్వక్సేనుడు పురవీధుల్లో విహరించనున్నారు. ఈ నెల 28న ఉదయం 9–10 గంటల మధ్య వేద పారాయణంతో శ్రీ వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం రాత్రి 9 గంటలకు చంద్రప్రభ వాహనం, 29న హంసవాహనం, 30న యాళివాహనం, 31న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి శేష వాహనం, జూన్ 1న ఉదయం గరుడ వాహనం, రాత్రి కల్పవృక్ష వాహనం, 2న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, 3న సాయంత్రం రథోత్సవం, రాత్రి తోట ఉత్సవం, 4న రాత్రి అశ్వ వాహనం, 5న సాయంత్రం తీర్థవారి, రాత్రి ధ్వజావరోహణం, 6న రాత్రి పుష్పపల్లకి సేవ ఉంటుంది. అనంతరం 7న రాత్రి వడాయితోత్సవంతో బ్రహ్మోత్సవాలను ముగించనున్నట్లు బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు


మున్సిపల్ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పట్టణంలోని ప్రధాన వీధులు, రహదారులపై ఉన్న మట్టి తొలగింపు పనులు, కాలువల శుభ్రం, పూడికతీత పనులను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. వర్షాలు మొదలవడంతో రోడ్లు, వీధుల్లో ఉన్న మట్టిపై వాహనాలు వెళితే అదుపుతప్పి ప్రమాదాలు, అలాగే మామిడి పండ్ల సీజన్ కావడంతో పలు రకాల జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా పారిశుద్ధ్య కార్యక్రమాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 31 వార్డుల్లోనూ ఒక్కో రోజు కార్మికులతో పనులు చేయిస్తున్నామన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడకుండ చెత్తకుండీలలో వేయాలని, లేదా కార్మికులు ఇళ్ల వద్దకు వచ్చిన సమయంలో చెత్తను అందజేయాలని కోరారు.

రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం


రేషన్ డీలర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం

గంగవరం: పలమనేరు పట్టణ రేషన్ డీలర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలమనేరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడిగా నరేంద్రకుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా జిలానీబాషా, జనరల్ సెక్రటరీగా జుబేర్ అహ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మునికృష్ణయ్య, ట్రెజరర్‌గా సనావుల్లా బాషా, సెక్రటరీగా రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డీలర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. అనంతరం సమావేశంలో తహసీల్దార్ ఇన్బనాథన్ మాట్లాడుతూ, వచ్చే నెల నుంచి రేషన్ షాపుల వద్ద పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని డీలర్లను ఆదేశించారు.

కోవిడ్ జాగ్రత్తలపై అవగాహన కల్పించండి


మంత్ర బయోమెట్రిక్ మెషిన్లను ఆరోగ్య కార్యకర్తలకు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

గంగవరం: కోవిడ్ మహమ్మారి మళ్ళీ విజృంభిస్తున్న నేపథ్యంలో కోవిడ్ 19 నిబంధనలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి చందనప్రియ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం పలమనేరు యూపీఎస్సీ కాకాతోపులో వైద్య సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైల్వే, బస్ స్టేషన్లు, ఎక్కువగా రద్దీ ఉన్న ప్రదేశాల్లో తిరుగుతున్నపుడు తప్పనిసరిగా భౌతిక దూరం పాటించి, మాస్కులు ధరించాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. అలాగే ఒంటినొప్పులు, జ్వరం, జలుబు మొదలైన లక్షణాలు ఉన్న వారు వైద్యులను సంప్రదించాలన్నారు. మంత్ర బయోమెట్రిక్ మెషిన్లను ఆరోగ్య కార్యకర్తలకు పంపిణీ చేశారు. వీటిని ఎన్‌సిడిసిడి సర్వేలో ఉపయోగించి ఆధార్ లింక్ సమాచారాన్ని పొంది, సర్వే పూర్తి చేయాలన్నారు. జూన్ 1 నుంచి జూన్ 30వ తేదీ వరకూ మలేరియా మాసోత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి జయశంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న 'వెలుగు' అధికారులు


మండల సమావేశంలో ఏపీఎంను నిలదీస్తున్న సభ్యులు

–మండల సమావేశంలో సభ్యుల ధ్వజం

గుడుపల్లె: వెలుగు కార్యాలయంలోని అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండల సభ్యులు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక శ్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధానంగా వెలుగు అధికారులపై సభ్యులు నిప్పులు చెరిగారు. ఏడాది నుంచి వెలుగు సంఘాల్లో ఏం జరుగుతోందో కూడా తెలియడం లేదని, అంతా గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాలలో సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నా కూడా ప్రభుత్వ సమాచారాన్ని కూడా తెలియజేయడం లేదని విమర్శించారు. వెలుగు కార్యాలయం పరంగా చేసే అభివృద్ధి, పథకాలకు సంబంధించిన విషయాలను తప్పనిసరిగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. అంతేకాకుండా మండలంలోని ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలోనే అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని జెడ్పీటీసీ కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా అభివృద్ధి జరగాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని హితవు పలికారు. ఏకపక్షంగా ఎవరూ వ్యవహరించరాదన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రాధాకృష్ణ, తహసీల్దార్ సీతారాం, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం


శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

బైరాల: విద్యార్థులకు పుస్తక పఠనంతో లభించే జ్ఞానం జీవితాంతం వారి వెంటే ఉండి వారి భావి జీవితాన్ని తేజోవంతం చేస్తుందని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు సోమవారం పుస్తక పఠనం, వేమన పద్యాలు కంఠస్థం చేయించారు. భగవద్గీత శ్లోకాలు పలికించడంతోపాటు నృత్యాలు, ఆటపాటలు ఆడించి పాడించారు. ఆమె మాట్లాడుతూ సృజనాత్మకతను పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

వీరజవాన్ తల్లికి బీమా చెక్కు పంపిణీ


పోస్టల్ బీమా చెక్ ఇస్తున్న తపాలాశాఖ అధికారులు

బంగారుపాళెం: మండలంలోని ఎగువరాగిమానుపెంటకు చెందిన వరదరాజుల మండడి, సెల్వి కుమారుడు పంగల కార్తీక్ కుటుంబ సభ్యులకు సోమవారం తపాలా జీవిత బీమా నగదు చెక్కును అందజేసినట్లు చిత్తూరు డివిజినల్ పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మన్న తెలిపారు. వీరజవాన్ నామినీగా ఉన్న తల్లి సెల్వికి ఇంటి వద్ద రూ.11,50,053 చెక్కును పోస్టల్ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో పలమనేరు సబ్ డివిజినల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి, రిటైర్డు పీఎల్ఐ డెవలప్‌మెంట్ అధికారి పురుషోత్తం, రాగిమానుపెంట బ్రాంచ్‌పోస్టు మాస్టర్ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

కరోనా వేళ మహానాడా?

చిత్తూరు కార్పొరేషన్: కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో టీడీపీ మంగళవారం నుంచి గురువారం వరకు కడపలో మహానాడు నిర్వహించడం ఎంతవరకు సబబు అని వైఎస్సార్ సీపీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఓ ప్రకటనలో ప్రశ్నించారు. దేశంలో క్రమేపీ కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.